# యుగయుగాల చరిత్ర



యం. శారదాచౌదరి

"హా నాథా!...నాథా!"

అశోక వనంలో అశోక వృక్షం క్రింద వర్షానికి తడుస్తూ ఎండకు ఎండుతూ నిద్రాహారాలు మానేసి, వేలి వుంగరం చేయికి కంకణం అయిపోయేంతగా చిక్కి-

శల్యమయిపోయిన పిచ్చి సీత తన భర్తకోసం విలపిస్తోంది.

తనను ప్రేమించమంటూరోజూ వేధించే రావణాసురుని కనీసం కన్నెత్తి అయినా చూడదు.

అతని మాటలు వింటూంటేనే అసహ్యంతో, జుగుప్సతో ముకుళించుకుపోతుంది.

అతని చూపులు పడితేనే తన శరీరం మలినమయి పోతుందేమో నన్నంతగా బాధపడుతుంది.

తన శరీరంలో ఒక్క అణువు కూడా కనిపించకుండా, ధరించిన వస్త్రంతో నిండుగా కప్పుకుని ఒదిగి, ఒదిగి కూర్చుంది.

అలాంటి సీతను-సాక్షాత్తూ తననే దైవంగా, సర్వస్వంగా భావిస్తున్న భార్యను అగ్నిలో దూకమన్నాడు శ్రీరామచంద్రుడు.

అగ్నిదేవుడితో సహా ముక్కోటి దేవతలూ ప్రత్యక్షమయి, మహా సాధ్వి సీతాదేవి శీలానికి సాక్ష్యం పలికితేగానీ, చేయనితప్పుకి ఆమెను క్షమించి ఏలుకోలేక పోయాడు.

* * *

హృదయం నిండా భారం....
తలమీద గంపలో బరువు....
మనస్సునిండా విచారం___
వీటిన్నింటినీ కృత్రిమమయిన సంతోషంతో (భర్త ఆనందం కోసం) కప్పివేసి, రగులుకుంటూన్న బడబానలాన్ని కంఠంలోనే బంధిస్తూ, కారబోతున్న కన్నీటిని నిలిపివేస్తూ, వడి వడిగా అడుగులేస్తోంది.

కానీ ఆమె జీవితంలోని కష్టాల్లాగే బాటనిండా ముళ్ళు....లెక్క చెయ్యకుండా, గమ్యం చేరుకోవటానికి అడుగులేస్తోంది.

కోటి కోర్కెలతో, భర్తే దైవం, అతనే తన సర్వస్వం అనే అభిప్రాయంతో అత్తింట్లో అడుగు పెట్టింది సుమతి.

కానీ ఆమె ఇచ్చే గౌరవాన్ని నిలుపుకోగలిగే వ్యక్తిత్వమున్న వాడు కాడు ఆమె భర్త.

త్రాగుబోతు....జూదరి.... స్త్రీ లోలుడూ!

ఇలాంటి వ్యక్తిని ఎవరూ గౌరవించలేరు.

కానీ అతను తన భర్త కనుక సుమతి గౌరవించింది.

అతన్ని గౌరవించలేకపోతే, భార్యగా తనకు మనుగడే లేదనుకున్నది.

అందుకే కనీసం ఒక్క రోజయినా తనను ఆదరించని భర్తను గౌరవించింది.

కుష్టురోగి ఐనా అసహ్యించు

కోకుండా అతనికి సేవ చేసింది. చివరకు అతని ఆజ్ఞ శిరసావహించి గంపలో పెట్టుకుని సానికొంపకు బయల్దేరింది.

సుమతి వేశ్య గృహం చేరుకుంది.

తట్టను దింపి, వేశ్య చేతులు పట్టుకుంది-

"అమ్మా! దయవుంచి అతని కోర్కె తీర్చు. ఇవి చేతులు కావు!" అంటూ.

ఆ త్యాగానికి సాటిస్త్రీ అయిన వేశ్యకు హృదయం ద్రవించింది. కనులు చెమర్చాయి.

కానీ భర్త అనబడే ఆ మగవానికి మాత్రం హృదయం కరగలేదు.

* * *

"మావాఁ! ఇదిగో ఈరవ్వ! చేలకడ్డం బడి లగెత్తుకుపోతూంటే, జుట్టు పట్టుకు లాక్కొచ్చా!"

గొప్ప ఘనకార్యం చేసినట్లు బోర విరుచుకొంటూ, ఓ స్త్రీని ఆమె మనవడివయస్సులో వున్న ఓ మగవాడు ముందుకు నెట్టాడు.

"లోకంలో ఆడాళ్ళందరికీ వుందా, నీకే వుందా__ఈ కర్మ? నొసట దేవుడు ఎట్టా రాస్తే అట్టా జరగాల్సిందే!"

ఈరవ్వ అని పిలవబడే వీరమ్మను, సాక్షాత్తూ కన్న తల్లిని, బలవంతంగా ఇంట్లోకి లాక్కొచ్చి, పసుపుతాడు తెచ్చి, చేతులు రెండూ వెనక్కి విరచి గుంజకు కట్టేశాడు- ఆమె నవమాసాలు మోసి, కని, పెంచిన కొడుకు.

ఈరవ్వ రాళ్ళూ, రప్పలూ సహితం కరిగి నీరయ్యేలా ఏడుస్తోంది. "ఆ పనికాకపోతే, నన్ను ఒక్క ఏటుతో నరికి చంపరాదూ! నీ కాళ్ళు మొక్కుతాను" అంటూ కొడుకును ప్రతిమాలింది.

ఆమె ప్రత్యక్ష దైవం ఇవాళో రేపో అన్నట్లు మంచంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు.

ఆడా, మగా ఒక్కొక్కరూ వచ్చి ఆ దంపతుల్ని పరామర్శించి పోసాగారు.

"నీకేం పొయ్యే కాలం వచ్చిందే? పారిపోయే పయత్నంలో పడ్డావంట! నీ మొగుడు చస్తే నీకింకా బతుకెందుకే? నీ పిగ తరగ! నిన్ను కాష్టంలో కాల్చ! ఎంత తలవంపులు తెచ్చావే?" ఈరవ్వ ఆడబిడ్డ తమ పరువంతా పోయినట్లు బాధపడుతూ సగం చచ్చివున్న ఈరవ్వను మాటలతో మరి కాస్త చంపింది.

విన్నటివరకూ ఈరవ్వ అందరికీ ఆప్తురాలు. తలలో నాలుకలా

ప్రతి ఒక్కరికీ సహాయం చేసింది. పగలూ, రేయీ, ఒళ్ళు విరుచుకొని రెక్కలు ముక్కలు చేసుకుని, వడ్లుదంపి బియ్యం చేసుకోవడం లోనూ, అడిగిన వాళ్ళందరికీ సహాయపడింది.

"పది రోజులు పేడ మురిగి పోతున్నది. ఒక్క చేతిమీద ఎందాకా చెయ్యను? కొ స్త ముద్దలు కొట్టిపెట్టు ఈరవ్వా!" అని ఎవరైనా అడిగితే, పేడపిపికి, ముద్దలు కొట్టి. పిడకలు పేర్చి అడిగినదాని కంటే ఎక్కువ సహాయం చేసేది.

అందరూ అభిమానించే అలాంటి ఈరవ్వ మీద ఈనాడు ఎవ్వరికీ సానుభూతి లేదు. ఆమెను రక్షించాలనే తాపత్రయమూ లేదు.

భయంతో వణికిపోతూ, నీర సంగా స్థంభానికి చేరబడ్డ అత్త దగ్గరకు వచ్చింది ఈరవ్వ కోడలు.

"అత్తా! రాత్రి పొద్దుపోయాక నీ కట్లు విప్పుతాను. ఎటన్నా పారి పో! లేకపోతే పచ్చగన్నేరు పప్పు తినైనా చచ్చిపో! అంతే కానీ ఆ పనికి మాత్రం సిద్ధపడకు. నేను చూడలేను!" అంది దుఃఖిస్తూ.

"ఒకసారి పారిపోబోయి పట్టు బడ్డాను. దిట్టంగా కాపలా పెట్టి వుంటారు. రెండోసారి తప్పించు కోవడం సాజ్యం కాని పని. వద్దుశే తల్లీ! అంత సాహసం చెయ్యకు. నా కొడుకు నిన్ను గొడ్డుని కొట్టి నట్లు చావ గొడతాడు!" అంది ఈరవ్వ కళ్ళు తుడుచుకొంటూ.

"అట్లా అనకత్తా! ఇవాళ కాక పోతే మరో రోజయినా నీ బాధ నేనూ అనుభవించాల్సిందే! నేనే గాదు, ఆడదై పుట్టిన ప్రతొక్కరూ అనుభవించాల్సిందే. అట్లా జరగ కుండా, ఏ పురుటిలోనో, సన్ని పాతజొరం వచ్చో నేను సచ్చిపోతే బాగుండునని రోజూ దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్నానత్తా!" కోడలు వెక్కిళ్ళు పెట్టింది.

"ఒసేయ్! మా నాన్న చచ్చి పోయాడు. దీపమిట్లా పట్టుకురా!" పంచలోంచి గావుకేక వినిపించింది.

ఈరవ్వ గతుక్కుమంది.

"అయిపోయింది- నా చావు తప్పదు!" అని భళ్ళున ఏడ్చింది.

తెల్లారాక-

వూరంతా కదిలివచ్చింది.

జరగవలసిన తతంగానికి సన్నాహాలు ప్రారంభించారు.

ముసలాడి శవానికి స్నానం చేయించారు.

పాడెమీద పడుకోబెట్టి, పూల దండ వేశారు.

ఈరవ్వకు నీళ్ళుపోసి, కొత్త

కోకగట్టి, పసుపుపూసి కుంకం దిద్దారు.

రెండుచేతులకీ బేడీలువేసినట్లు తాడుతో గట్టిగా కట్టి, ఆ తాడు చివర ముసలాడి పాడెకు కట్టారు.

శవవాహకులతో పాడె, పూల రథంలా కదిలింది.

ఈరవ్వ ఏడుపు వినిపించ కుండా మంగలిరాముడి చావుమేళం చెవులు చిల్లులు పడేట్లు మోగ సాగింది.

"నాయనమ్మా!" అంటూ పిల్లలు ఏడుస్తూ వెంటబడ్డారు.

"ఆ కర్మకాండ నేను చూడ లేను!" అంటూ కోడలు ఓ మూల కూలబడి చెంగుతో ముఖం కప్పు కుంది.

శ్మశానంలో___

తండ్రి చితికి నిప్పంటించాడు తనయుడు.

నలుగురూ పట్టి- గింజుకుంటూ, ఏడుస్తూన్న ఈరవ్వను మంటల లోకి ఈడ్చారు.

చితిమీద కాలుతూ ఆమె చేసే ఆర్తనాదాన్ని ఎవరూ పట్టించుకో వటం లేదు.

కిందకు దిగి పరుగెత్తటానికి ఆమె చేసే ప్రయత్నం వెట్టివాడు సాగనివ్వటం లేదు.

గడలతో, ప్రాణమున్న ఆమె ఒంటిని విరగకొట్టి లేచే ప్రయ త్నాన్ని విరమింప చేస్తున్నాడు.

పావుగంట తర్వాత శరీరం ఎగిరెగిరి పడడం ఆగిపోయింది. ఈరవ్వ సతీసహగమనం ముగి సింది.

ఆమె కొడుకు పక్కకు తిరిగి కళ్ళొత్తుకున్నాడు.

* * *

అరుగుమీద, వడ్లగాదెల చాటున, ఇటుకలు పేర్చి బొమ్మ రిల్లు వేశారు.

సీతమ్మా, చినలచ్చమ్మా కలసి, ఇంట్లో పాతగుడ్డలు చింపి తెచ్చిన పీలికల్ని, తాటాకు బొమ్మలకు కట్టి బొమ్మల పెళ్ళి ఆటలాడుకుంటు న్నారు.

లక్కపిడతల్లో కందిపప్పు, చింతపండూ, బియ్యంనూకా సమృ ద్ధిగా వున్నాయి.

నిండా పదేళ్ళు కూడా లేవు ఇద్దరికీ!

లోకం తెలీని వయస్సు! ఊహలు తెలియని ప్రాయం!

"అవ్వ! పెళ్ళీడుకొచ్చిన పిల్లవి! అడ్డమయిన వాళ్ళందర్నీ చేర్చుకుని బువ్వలాట ఆడుతున్నావా? లోపలికి చావు!" కాళ్ళకున్న కడియాలూ, గొలుసులూ ఘల్లు- ఘల్లు మని పించుకుంటూ విసురుగా వచ్చి తన

కూతుర్ని రెక్కబట్టి బరబరా లోపలికి లాక్కెళ్ళింది వెంకాయమ్మ.

"పెళ్ళయినదానివి, రేపో మాపో కాపురానికి పోతూ ఇంకా బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తున్నావా? అయినా నాకు తెలీక అడుగుతాను. ఈడు ముదిరినా పెళ్ళి కాకుండా వూరేగుతున్న వాళ్ళతో నీకేం పనే?"

వెంకాయమ్మ తోడికోడలు నరసమ్మ, చరచరా వచ్చి తన కూతురు చినలచ్చమ్మ పిర్ర మీద ఒక్కటి అంటించింది.

బేరుమంటూ ఏడుస్తూ, తన బొమ్మల గుడ్డ సంచీని అరుగుమీదే వదిలి ఇంట్లోకి పరుగెత్తింది లచ్చమ్మ.

"ఏందె, కారుకూతలు కూస్తున్నావు? నా కూతురికి ఈడు ముదిరిపోయిందా? పెళ్ళికాకుండా వూరేగుతున్నదా? నీలాగా శుల్కాని కాశపడి నా కూతుర్ని ముసలాడికిచ్చి చేసి, పిల్లగొంతు కోసి డబ్బు మూటలు కట్టనే! నా కూతురికి రాజాలాంటి సంబంధం చేస్తాను."

వెంకాయమ్మ యుద్ధానికి వచ్చింది.

తోడికోడళ్ళిద్దరికీ క్షణం పడదు. గుర్రాల చావిడిలాంటి మండువా ఇంట్లో తడికలు అడ్డం పెట్టుకుని ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నా, ఆడవాళ్ళ మధ్య యుద్ధం మాత్రం రోజూ జరిగి తీరుతుంది.

ఒక్కోసారి తిట్లవర్షంతో ఆగిపోయినా, కొన్నిసార్లు ముష్టి యుద్ధాలు కూడా సాగేవి.

సమయానికి భర్తలు వస్తే మాత్రం కుక్కిన పేనుల్లా నోళ్ళు మూసుకుని అసలు ఏమీ జరగనట్లే ఎవరి భాగంలోకి వాళ్ళు వెళ్ళిపోయేవారు.

"కారు కూతలు నాయ్యా? నీయ్యా? అడ్డమయిన వాళ్ళల్లో జేరుస్తారా నా కూతుర్ని? దాన్ని అల్లారు ముద్దుగా పెంచుకున్నానే! దానిమీద ఈగ వాలినా నేనూరుకోను. కట్నానికి ఆశపడింది నేను కాదు నువ్వు. నువ్వే కట్నానికి ఆశపడి పిల్లకి ఈడు ముదురుతున్నా, ఎన్ని సంబంధాలొస్తున్నా కట్నం చాలక తిరగ్గొడుతున్నదీ!"

మరో అరగంటకు గానీ వారి యద్ధం ముగియలేదు.

ఈ గొడవ జరిగిన నాలుగు రోజులకే పంతం కొద్దీ చిన లచ్చమ్మ కాపురానికి పంపబడింది. సీతమ్మకు రెండువందల రూపాయల కన్యాశుల్కంతో పెళ్ళయిపోయింది.

పదేళ్ళ పాపలు కాపురంచేస్తే ఏమవుతుంది?

తన పదకొండో ఏట, కాన్పు కష్టమై చచ్చిన పిల్లాడిని కని తనూ చచ్చిపోయింది చినలచ్చమ్మ.

పెళ్ళయిన సంవత్సరానికి విష జ్వరం తగిలి మొగుడు చచ్చి పోతే, ముండమోసి పుట్టింటికి చేరుకుంది సీతమ్మ.

ఆ నాటినుంచీ కాస్త చదువు సంధ్యలు నేర్చినవాళ్ళంతా ఆమెను 'బాల్యవితంతువు' అని నాజూకుగా పిలవసాగేరు.

'చినలచ్చమ్మ చచ్చిపోతే, దాని మొగుడ్ని, ముండమోపి, బాల్య వితంతువుడు అని పిలవరేం?' తెల్లమల్లు పంచ కట్టుకుని, బోడి గుండు చేయించుకున్న పన్నెం డేళ్ళ సీతమ్మకు అప్పుడప్పుడూ ఈ అనుమానం కలుగుతూండేది.

* * *

ప్రపంచమంతా "మహిళా సంవత్సరం" జరుపుకుంది.

స్త్రీలలో కొంగ్రొత్త ఆశల చిగుర్లు.....

ఎన్ని రోజులకి స్త్రీలకి గుర్తింపు?

వారికోసం ఓ సంవత్సరాన్ని ప్రత్యేకించి, దానికి మహిళా సంవ త్సరమని పేరుపెట్టి....

ఈ టైటిల్‌తో వ్యాస రచ నలు, వక్తృత్వ పోటీలు నిర్వ హించి, పత్రికలవారు కూడా ఘనంగా సహకరిస్తూ....

'ఇండియా స్త్రీలని పట్టి పీడి స్తున్న వరకట్న పిశాచం వదిలి పోతుందేమో!' (పోదు!)

స్త్రీలలో ఎంతో వుత్సాహం! మరెంతో చైతన్యం!

ఓ లేడీస్ క్లబ్ వారు మహిళా సంవత్సరాన్ని పురస్కరించుకుని, ఘనంగా ఉత్సవం జరుపుకుంటు న్నారు.

ముఖ్య అతిథిగా మహిళా సంక్షేమ శాఖామంత్రిగారు ఆహ్వా నింపబడ్డారు.

వేదిక నలంకరించిన మిగిలిన వారిలో వివిధ ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న ఆఫీసర్లున్నారు.

వారంతా తమ తమ వుపన్యా సాల్లో స్త్రీలను పొగిడారు. వారు సాధించిన ప్రగతి, అభ్యుదయం గురించి ధారాళంగా మాట్లాడారు.

చివరగా, మంత్రిగారు మైక్ ముందు నిలబడి తమ కంఠం విప్పారు.

ఆయన గళ మాధుర్యానికీ, తన మీద ఆయన ప్రదర్శిస్తున్న ప్రతాపానికీ మైక్రోఫోన్ అదిరి పోయింది.

"ఈ రోజుల్లో, ఆడవారు.... అంటే స్త్రీలు ప్రవేశించని రంగం లేదూ, ఏలని సామ్రాజ్యం లేదు. ఉదా॥ నవలా సామ్రాజ్యమే తీసుకోండి! కొన్ని సంవత్సరాలుగా స్త్రీలే దీనిని ఏక ఛత్రాధిపత్యంతో ఏక బిగిని ఏలేస్తున్నారు. మగవారు ఎంత ప్రయత్నించినా సరే ఆ స్థానాన్ని ఆక్రమించ లేకపోయారు. ఆడపేర్లు పెట్టుకుని ప్రయత్నించినా వారికి ఫలితం దక్కదు.

"అంతే కాదు. పోలీసు రంగంలో కూడా స్త్రీలు ప్రవేశించారు. మగవారికి చోటు లేకుండా చేస్తారేమోనని భయం కూడా వేస్తున్నది."

ఆడియన్స్ చప్పట్లు....

"కనుక ప్రతీ స్త్రీ కూడా గణిత శాస్త్రజ్ఞురాలు శకుంతలాదేవీ, రచయిత్రి రంగనాయకమ్మ, పోలీసాఫీసర్ కిరణ్ బేడీ, డాక్టర్ సుభద్రాదేవీ, కలెక్టర్ సుమిత్రాదేవిలు కావాలని ఆశిస్తూ, దీవిస్తూ ఇంతటితో విరమిస్తున్నాను. చివరగా ఒక్క మాట....అమ్మా! మీరంతా వచ్చే ఎన్నికల్లో మా పార్టీకే ఓట్లు వేసి, మీకు మరింతగా సేవచేసే భాగ్యం, అవకాశం మాకు కల్పించమని ప్రార్థిస్తూ, శలవు తీసుకుంటున్నాను" మంత్రిగారి వుపన్యాసం అయిపోయింది.

మైకు స్థిమితపడింది.

సమయం రాత్రి 8 గంటలు కావస్తోందప్పుడు.

అందరూ ఇళ్ళ ముఖం పట్టారు.

కార్లున్న వాళ్ళు కార్లలో.... లేని వాళ్ళు రిక్షాల్లో, ఆటోల్లో.... ఇల్లు దగ్గరే కావాపి, సీత గబగబా నడవసాగింది.

సందు మలుపు తిరిగి, రైల్వే ట్రాన్స్పదాకా వచ్చింది.

స్ట్రీట్ లైట్ పోయిందేమో, ఆ ప్రదేశాన్ని చీకటి ఆవరించింది.

"ఏయ్! కాస్త ఆగు!" వెనక నుంచి కానిస్టేబుల్ పిలిచాడు. వెనుతిరిగి చూసిన సీతకు ఒళ్ళు మండి పోయింది. బహుశా తనని కాదేమో అనుకుంది. కానీ కానిస్టేబుల్ గబగబా వచ్చి ఆమెను చేరుకున్నాడు.

అటూ, ఇటూ చూపి లాఠీతో ఆమె భుజం మీద పొడిచి, ముందుకు నెట్టాడు.

"పద స్టేషన్కు."

సీత గట్టిగా విదిలించుకుంది. రోషావేశాలతో ఆమె ముఖం కంద గడ్డలా మారిపోయింది. ముక్కు మీద స్వేద బిందువులు అలుముకున్నాయి. పెదాలు కోపముతో వణికి పోసాగాయి.

"స్టుపిడ్! ఎవరనుకుంటు న్నావురా? ఎంత అవమాని స్తున్నావు? నీ మీద కేసు పెట్టి జైల్లో తోయిస్తాను."

కానిస్టేబుల్ ఆమె అమాయ కత్వానికి నవ్వు కున్నాడు.

"ఆ జైలుకి కాపలా కాసేది నేనేలే!" అంటూ ఏదో జోక్ వేసినట్లు గర్వపడ్డాడు.

అంతవరకూ నాలుగడుగుల దూరంలో ఆగి వున్న జీప్, స్టార్టయి వాళ్ళ దగ్గరకు వచ్చింది.

కానిస్టేబుల్ చప్పున ముందుకు వంగి, వూహించని రీతిగా ఆమె


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

హెడ్డాఫీస్:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)

బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి, ఫోన్ : 551.

26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘవ్యాధులకు వుత్తమ వైద్యము

దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వారికి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొన రాదు.) హెర్నియా, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.



వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇసినోఫీలియా (దమ్ము) ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: "శివలీల" తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర,
గుంటూరు (ఎ.పి.)

నోరు గట్టిగా నొక్కి పట్టుకుని జీపులోకి తోసి, తనూ ఎక్కి కూర్చున్నాడు.

సీత గిలగిలా తన్నుకుంటూ వదిలించుకోబోయింది.

తప్పించుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తూనే వుంది.

జీప్ మునిసిపాలిటీ గెస్ట్ హౌస్ లోపలి కంటూ వచ్చి ఆగింది.

ఒక కానిస్టేబుల్ సీతను బలవంతంగా భుజాన వేసుకుని తీసుకెళ్ళి, అయ్యగారి పక్కన డబుల్ కాట్ మీద పడేసి, తలుపులు దగ్గరగా లాగి బయటి కొచ్చి నిలబడ్డాడు.

సీత గింజుకుంది, కరిచింది, రక్కింది. తన శక్తి వున్నంత వరకూ పెనుగులాడుతూనే వుంది.

ఒక చేత్తో సీతను గుచ్చి పట్టుకుని, మరో చేత్తో లోపల గడి వేసుకున్నాడు పోలీసాఫీసర్!

ఎంగిలి విస్తరాకు కోసం చొంగలు కారుస్తూ ఎదురు చూచే కుక్కల్లా, ఇద్దరు కానిస్టేబుల్సూ, జీప్ డ్రైవరూ గది బయట తచ్చాడసాగారు.

అరగంట గడిచాక మామిడి కాయ రసం పీల్చి టెంకను విసిరేసినట్లు, ఆఫీసర్ సీతను బయటికి తోసి తలుపు మూసుకున్నాడు.

సీతకళ్ళు వర్షిస్తున్నాయి. నిప్పులు కురిపిస్తున్నాయి. బోనులో పడ్డ పులి చందంలా వుంది ఆమె పరిస్థితి.

ఆ క్షణంలో ఆమె చేతిలో ఏ చిన్న ఆయుధమున్నా సరే, ఆ నలుగుర్నీ దారుణంగా హత్యచేసి వుండేది.

ఇంతెందుకు? ఆమె చూపులకే శక్తివుంటే వారందరూ ఓక్షణంలో భస్మమయి బూడిద మిగిలేది.

కానీ సీత, కలియుగంలో పుట్టిన ఓ సామాన్య యువతి. ఆమె శీలం కాపాడటానికి ఏ దేవుడూ దిగి రాలేదు.

ముగ్గురూ ఆమెను ఓ మూల గదిలోకి లాక్కుపోయి....

* * *

వ్రాసుకుంటూ పోతే, ఈ చరిత్రకు పేజీలు చాలవు. సముద్రంలో వున్న నీళ్ళన్నింటినీ సిరాగా మార్చినా ఈ చరిత్ర వ్రాయటానికి సరిపోదు.

అందుకే యుగ యుగాల ఈ స్త్రీ చరిత్రను రచయిత్రి అతి క్లుప్తంగా వ్రాయటం జరిగింది.

కానీ ఒక్క ప్రశ్న!

ఈ స్త్రీ చరిత్ర మానవులు గర్వించ తగినదా? సిగ్గుపడవలసినదా?

*